అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 21 మార్చి 2023

నలుగురు ఉపాధ్యాయుల ఒక రోజు వేతనం నిలిపివేత

నవతెలంగాణ-సారంగాపూర్

విధులకు ఆలస్యంగా వచ్చిన నలుగురు ఉపాధ్యాయుల ఒక రోజు వేతనం నిలిపేస్తూ డీఈఓ రవీందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని (స్వర్ణ) పొన్క్యూర్ ప్రాథమిక పాఠశాలకు సమయానికి హాజరుకావడం లేదని పోషకుల ఫిర్యాదుతో కాంప్లెక్స్ హెచ్ ఎం.దశరథ్‌ను విచారణకు ఆదేశించారు. సోమవారం పాఠశాలకు వెళ్లి చూడగా ముందస్తు సమాచారం లేకుండానే విధులకు హాజరు కాలేదని డిఈఓకు ఫోన్ ద్వారా తెలియజేశారు. సమయపాలన పాటించకుండా పాఠశాలకు ఆలస్యంగా వస్తున్న ఎం.మంగులాల్ (ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్), ఎస్‌జీటిలు టి. శ్రీనివాస్, ఎం. గిరీష్ కుమార్, ఎం.శ్రీనివాస్‌పై చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరుకాకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట క్షేత్రాలను పరిశీలించిన ఏడీఏ

తాండూర్ : అకాల వర్షాల నేపథ్యంలో ఏడీఏ సురేఖ సోమవారం మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజులుగా కురిసిన వర్షాల వల్ల మండలంలో ఎలాంటి పంట నష్టం జరగలేదని తెలిపారు. మామిడికి నష్టం జరిగినట్లయితే ఉద్యానవన శాఖను సంప్రదించాలని కోరారు. అకాల వర్షాల వల్ల వరిలో మెడ విరుపు, కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశాలున్నాయని, రైతులు సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆమె వెంట ఏఈఓ శంకర్, రైతులు ఉన్నారు.



ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఎస్‌పి అచ్చేశ్వరరావు, ఆర్‌డిఓ రాజేశ్వర్‌తో కలిసి ఆధార్ నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, మీసేవ కేంద్రాలు, బ్యాంకులలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా నమోదును త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలాల్లో ఎంపీడీఓ, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం ఆధార్ నమోదు ప్రక్రియకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుఐడిఎఐ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సుబాన్, ఈడీఎం గౌతమ్ రాజ్, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా పౌర సంబంధాల అధికారి కృష్ణమూర్తి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాల బీఆర్ఎస్ నాయకులు పుప్పాల శంకర్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలని ఉపాధి నిధులు 1300 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. పేద ప్రజల నడ్డి విరిచేలా పెట్రో, గ్యాస్ ధరలు పెంచిందన్నారు. ఆర్టీసీ చార్జీలను డీజిల్ ధరలు పెరగడం వల్లే పెంచాల్సి వచ్చిందన్నారు. పేపర్ లీక్‌లో బీజేపీ నాయకుల పాత్ర ఉందని, రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు పరిమి సురేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, రైతుబంధు సమితి అధ్యక్షుడు పుప్పాల గజేందర్, డిఆర్‌బిఎస్ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, కౌన్సిలర్స్ తొంటి శ్రీను, జన్నారపు శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు కౌట మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేహరాజ్, మహేష్ పాల్గొన్నారు.

కైరిగూడ రోడ్డును సరిచేయాలి



నవతెలంగాణ - రెబ్బెన

గోలేటి టౌన్‌షిప్ నుండి కైరిగూడ ఓపెన్‌కాస్టుకు వెళ్లే రోడ్డును సరిచేయాలని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. పావురాల గుట్ట వద్ద పెద్దపెద్ద రాళ్ళు పడడంతో వర్షాకాలంలో రోడ్డు చెడిపోయి ఇప్పటికీ ఆరు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోవడం లేదని తెలిపారు. సోమవారం కైరిగూడ ఓపెన్‌కాస్టుకు వెళ్లే రహదారిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత వర్షాకాలంలో గుట్టల పైనుండి బండలు జారిపడడంతో రోడ్డు చెడిపోయిందని, అప్పటి నుండి శాశ్వత పనులు చేపట్టలేదన్నారు. నిత్యం వందలాది లారీలు ఇక్కడి నుండి గోలేటి సీహెచ్‌పీకి బొగ్గు సరఫరా చేస్తుంటాయని, కానీ సింగరేణి యాజమాన్యం రోడ్డు విషయంలో ఎలాంటి పర్మినెంట్ పనులు చేపట్టలేదన్నారు. చిన్నచిన్న వర్షాలకే రోడ్డు చిత్తడిగా మారడంతో పాటు ఏ క్షణమైన గుట్ట నుండి బండలు జారిపడే ప్రమాదముందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ఫారెస్టు డిపార్టుమెంటుతో మాట్లాడి రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని కోరారు. లేనిపక్షంలో రానున్న వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి జరిగే అంతరాయానికి బెల్లంపల్లి ఏరియా యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కమిటీ సభ్యుడు మారిన వెంకటేశ్, కైరిగూడ ఓపెన్‌కాస్టు సేఫ్టీ కమిటీ సభ్యుడు ఓరం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

ఎన్‌హెచ్ 63 జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో నిబంధనల ప్రకారం తొలగించాల్సిన 66 ఫీట్లకుగాను 50 ఫీట్లు వదిలి 16 ఫీట్లలో అక్రమ నిర్మాణాలు చేస్తూ రోడ్డు ఇరుకుగా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బస్టాండ్ ప్రాంతవాసులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల మేరకు 66 ఫీట్ల వరకు ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంచిర్యాల నుంచి జగ్దల్పూర్ 63 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మంచిర్యాల నుండి ఇందారం క్రాస్ రోడ్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులలో కనీసం 66 ఫీట్ల భూమి వదిలి నిర్మాణాలు చేపట్టాలని డివిజన్ నేషనల్ హైవే డీఈ అన్నయ్య తెలిపారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాల మూలంగా రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏజెన్సీ ప్రాంతాన్ని పట్టించుకోని ప్రభుత్వం

- సీఎల్‌పీ నేత బట్టి విక్రమార్క
- ఆసిఫాబాద్ జిల్లాలోకి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ - జైనూర్

గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ శాసనసభ పక్షనేత మల్లు బట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నుండి పాదయాత్రను ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించింది. జంగాం సమీపంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పాదయాత్ర బాధ్యతను ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు అప్పగించారు. జంగాం నుండి జామిని గ్రామం వరకు సుమారు 22 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తిచేసి జామిని గ్రామంలో బస చేశారు. ఈ సందర్భంగా పాదయాత్రలో జంగాం, ఉషేగావ్, పొచ్చంలొద్ది, జైనూర్, పవార్‌గూడ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను తమ సమస్యగా భావంచి పరిష్కరించేందుకు అసెంబ్లీలో పోరాడుతానని ప్రజలకు బట్టి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు నేటికి ఈ ప్రాంతంలో ఉన్నాయన్నారు. 9ఏండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల గోడు వినిపించుకోలేదని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యమందిస్తానని సీఎం కేసీఆర్ ఎన్నోసార్లు ప్రకటన చేసినా జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో నేటి వరకు వైద్యులు లేక గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మంచినీరు అందించడంలేదని, పోడు భూములకు హక్కులు కల్పించడం లేదని పలువురు బట్టికి వివరించారు.



రోజంతా పనిచేస్తే రూ.వంద రావడంలేదు

జంగాంలోని ఆదివాసీ గిరిజన హస్తకళాకారుల కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా కళాకారులు సీఎల్‌పీ నేత బట్టి విక్రమార్కకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రోజంతా కష్టపడి బొమ్మలు తయారు చేసిన రూ.వంద కూడా రావడం లేదని వాపోయారు. జంగాం గ్రామంలో దాదాపు 30 కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, తమకు ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అందించేలా చూడాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న దళిత గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వడం లేదని, ఈ ప్రాంత దళితులకు సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని దళిత అధ్యక్షుడు బట్టి విక్రమార్కను కోరారు. గ్రామాల్లో పాదయాత్రకు మహిళలు సాంప్రదాయాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గణేష్ రాథోడ్, మర్సకోల సరస్వతి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - జైనూర్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపడుతున్న జనచైతన్య యాత్రను విజయవంతం చేయాని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా నాయకులు అల్లూరి లోకేష్, గొడిసెల కార్తీక్, రాజేందర్‌తో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎంతో న్యాయం చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడడానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మార్చి 23 నుండి 29 వరకు తెలంగాణలో జన చైతన్య యాత్ర కొనసాగుతుందన్నారు. మోడీ, అమిత్‌షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు కట్టబెడుతూ ప్రజలపై భారం మోపుతుందని తెలిపారు. నూనె, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తో పాటు అన్ని నిత్యావసర వస్తువుల ధరలను పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1150కి పెరిగిందని గుర్తు చేశారు. పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకుల జన చైతన్య యాత్ర ద్వారా ప్రజలను చైతన్యం చేస్తారని తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



నవతెలంగాణ-అదిలాబాద్‌రూరల్

సీఎం హామీ మేరకు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని, అప్పటివరకు కనీస వేతన పేస్కేలు అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్షలో 15ఏళ్లుగా వివిధ విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20వేల మంది ఉద్యోగులు ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్నారని, వీరందరిని క్రమబద్ధీకరించవలసిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ లోపుగా సెర్ప్ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా వేతన పేస్కేల్ అమలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు సంవత్సరాల్లో వందకుపైగా సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ కారణాలతో మరణించారని, ప్రభుత్వం వీరికి కనీస సహాయం కూడా అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య బీమాకు ఐదు లక్షలు, జీవిత బీమాకు పది లక్షల రూపాయలు ప్రతి ఉద్యోగికి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు డి అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ దీప్తి, ప్రధాన కార్యదర్శి పడాల రవీందర్, ఉపాధ్యక్షుడు ఆర్.ప్రకాష్, సురేష్ అన్ని విభాగాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా వ్యవహరిస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పునరుద్ఘాటించారు. ఐకెపి సెర్ప్ ఉద్యోగులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుండి పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 11 రూపంలో ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఐకెపి సెర్ప్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ సీఎం గతంలో సెర్ప్ ఉద్యోగులకు హామీ ఇచ్చి నెరవేర్చారని అన్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం పడుతున్నప్పటికీ ఉద్యోగుల పక్షపాతిగా తమ ప్రభుత్వం ఉందన్నారు. ఐకేపీ సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నాగేశ్వరరావు, డిఆర్డిఓ సురేందర్, ఏపీడి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.





జైనూర్ : ఎన్నో ఏండ్ల నుండి కాంట్రాక్టర్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్న ఐకేపీ సిబ్బందికి జీవో నెం 11 విడుదల చేయడం హర్షణీయమని ఏపీఎం సుజాత, సిర్పూర్(యు) ఏపీఎం వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన ఐకేపీ ఏపీఎంలు, సీసీలు కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1991 నుండి ఐకేపీలో వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులుగా కొనసాగుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు పేస్కేల్ జీవో ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ గోపాలకృష్ణ, సీసీలు గుణవంత్, చంద్రకళ, మూడు మండలాల సీసీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌టీయూ భవన్‌లో జరిగిన ఐఎఫ్‌టియు జిల్లా 8వ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మికులు తీవ్రమైన శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెట్టే విధంగా కార్మికుల హక్కులను కాలరాస్తూ చట్టాలు చేస్తోందని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న అనేక హక్కులను, చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ కార్పొరేట్లకు లొంగిపోయి, ఊడిగం చేస్తూ కార్మిక వర్గానికి ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. 41 జీవోను అమలు చేయాలని, కోప్ట చట్టాన్ని రద్దు చేయాలని, అర్హులైన కార్మికులందరికీ జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌లో పనిచేస్తున్న వర్కర్స్ అందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, ఓట్ల రాజకీయాలు చేస్తూ కులం, మతం పేరుతో ప్రజల మధ్య విభజన చిచ్చు పెడుతూ ఓట్లు దండుకుంటున్నాయన్నారు. పేదవాళ్లందరూ ఒక్కటై పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సునారికారి రాజేష్, భూక్య విలాస్, దుర్గం లింగన్న, లక్ష్మి గోదావరి, కవిత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని బ్రాహ్మణ గల్లీలో సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ లక్ష్మణరావు ప్రారంభించారు. రూ.30లక్షలపైగా నిధులతో ప్రతి కాలనీలలో రోడ్డు పనులు పూర్తవుతాయని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మాజీ ఎంపీటీసీ పోతన్న, జ్ఞాని పటేల్, భూమేష్ పాల్గొన్నారు

మహా సమ్మేళనంపై ఆరోపణలు సరికావు



నవతెలంగాణ-నస్పూర్

గత నెలలో సింగరేణి పాఠశాల నిర్వహించిన మహాసమ్మేళనంపై సంబంధం లేని వ్యక్తులు సంఘంగా ఏర్పడి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మహా సమ్మేళన సమన్వయకర్తలు పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదు నెలలుగా ఏ సమావేశాలకు రానివారు, ఏ రకమైన సహకారం చేయకుండా అసంతృప్తి, వ్యక్తిగత కక్షలతో సంఘంగా రిజిస్టర్ చేసుకొని మహాసమ్మేళన ప్రాశస్త్యాన్ని తగ్గిస్తూ ఆరోపణలు చేశారని తెలిపారు. మహాసమ్మేళనం జాయింట్ అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న ఉపాధ్యాయులను కూడా అగౌరవ పరిచే విధంగా వారి పేర్లను వాడుతూ మనస్థాపానికి కారకులయ్యారని తెలిపారు. మహా సమ్మేళన కార్యక్రమం కోసం రూ.3,040,362 సేకరించామని, ఇంత వరకు రూ.28,03,530 ఖర్చు చేశామని తెలిపారు. ప్రతి ట్రాన్‌సెక్షన్ బ్యాంక్ ద్వారానే జరిగిందని, డిపాజిట్లు కూడా బ్యాంకులోనే చేశామని తెలిపారు. అంత పారదర్శకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ రూ.40 లక్షలు వసూలు చేశారని, వ్యక్తిగతంగా వాడుకున్నారని అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆరోపణలు చేసిన సంఘం సభ్యులపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మహాసమ్మేళన సమన్వయకర్తలు కొమరగిరి వాణిశ్రీ, రాజారెడ్డి, నిర్వాహకులు రాపోలు విష్ణువర్ధన్‌రావు, దొనికెన సమ్మయ్య, డప్పు సమ్మయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కె.తిరుపతి, పి. సురేందర్‌రెడ్డి, పి. సురేందర్, జక్కుల మల్లేష్, గోసిక మనోజ్, నల్ల సంపత్, రేఖాఠాగూర్, శంకర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

సిర్పూర్(టి): మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని ఎంపీడీఓ రాజేశ్వర్ తెలిపారు. అధికారులు హాజరైనప్పటికీ ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష ఎంపీటీసీ సోయల్ హైమద్ విలేకరులతో మాట్లాడుతూ మండలాభివృద్ధి కోసం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తుండగా అధికార పార్టీ సభ్యులు హాజరుకాకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులే కీలకమని, సమావేశానికి హాజరుకాకపోవడం చూస్తుంటే వారికి పాలనపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - బెజ్జూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బోర్కడె హేమంత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సలుగుపెల్లి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. నిరుపేదలందరూ కంటి పరీక్షలు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రిజిష్టర్లను పరిశీలించారు. కంటి వెలుగుకు ప్రజలు హాజరయ్యే విధంగా చూడాలని గ్రామ కార్యదర్శి ధర్మయ్యను ఆదేశించారు. అనంతరం పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఊద్సరంగపల్లి గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారికి ఇరువైపుల మురికి కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. అనంతరం గ్రామ పంచాయతీని సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీపాల్, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఏపీఓ చంద్రయ్య, డాక్టర్ సాయికృష్ణ, సర్పంచ్ కొడప విమల, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కొడప విశ్వేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు కోంద్ర రవీందర్‌గౌడ్, ఏణుక శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని లంబాడిపల్లి గ్రామ సమీపంలోని సెంట్రల్ సిల్క్ బోర్డుకు చెందిన భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, దాన్ని కాపాడాలని బీజేపీ నాయకులు సోమవారం ప్రజావాణిలో ప్రత్యేక అధికారి కృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈ స్థలంలో పట్టు గుల్ల కోసం పెంచుతున్న ఏరు మద్ది చెట్లను కొందరు అధికార పార్టీ నాయకులు నరికి భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి స్థలం చుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి చెన్నూర్ పట్టణ అధ్యక్షులు సుశీల్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్, నాయకులు కొండపాక చారి, గడిపెల్లి సంతోష్, సంజయ్, సంతోష్, కుమ్మరి దేవాజి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన భూమిక గర్భిణీ సోమవారం అంబులెన్స్‌లో ప్రసవించింది. గర్భిణీకి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందజేశారు. అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో ప్రసవించి, మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఆర్పీ పి.మహేష్, ఈఎంటి సురేష్, పైలట్ గోపీనాథ్ తెలిపారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలో హనుమాన్ తండ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామ మైన లక్ష్మీనగర్ తండాలో సోమవారం ఉప సర్పంచ్ చవాన్ ప్రకాష్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు ఇంట్లోని చెత్త రోడ్డుపై పోయకుండా పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని అన్నారు. పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని తండా వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాదవ్ పూర్ణ బాయి, జాదవ్ ధన్‌రాజ్, రాథోడ్ దేవిదాస్, చవాన్ శ్యామ్ రావు, తండా వాసులు పాల్గొన్నారు.



సైన్స్ లాబోరేటరీకి పరికరాలు అందజేత



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల పరిషత్ నిధుల నుండి మండలంలోని సెకండరీ పాఠశాలలకు సోమవారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అధ్యక్షతన రూ.80వేల విలువ చేసే సైన్స్ లాబోరేటరీ పరికరాలు అందజేశారు. పరికరాలు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఎంతో ఉపయోగమని ఎంపీపీ అన్నారు. ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకొనేలా ప్రణాళిక రూపొందించాలని ఉపాధ్యాయులకు ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరోద్దీన్, వైస్ ఎంపీపీ కల్పన, ఎంపీటీసీలు అనిత సురేష్, బుసి రామ ముత్యం, గణేష్, లక్ష్మి రమేష్, రాజేశ్వర్, కంకల కల్యాణి గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

- రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పదో తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీఎస్ఎస్ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. వందశాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను సూచించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు కేటాయించిన ఇంటర్నల్ మార్కుల జాబితాను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పరీక్ష సమయంలో అభ్యర్థులు నిర్దేశించిన సమయం కంటే అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్ష రాయాలని అన్నారు. పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులలో పాటు, పోషకులు విద్యార్థులను ఇంటివద్ద ప్రణాళిక బద్ధంగా చదివేటట్లు తగు జాగ్రత్తలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ సంధ్బంగా ఆయన వెంట సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య, అశోక్, ప్రతాప్, ప్రధానోపాధ్యాయులు గోపాల్ సింగ్ తీలావత్, ఉపాధ్యాయులు రవీందర్ చారీ, జలంధర్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి

నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల మూడు రోజుల కింద 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీనికి సంబంధించిన కారణాలను ప్రిన్సిపల్ ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల పరిసరాలను విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, వంట గది, సాంబారు పప్పు వంటకాలను స్టాక్ రూంను పరిశీలించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యం పై ఆరా తీశారు. వారి వెంట ఎంపీటీసీ పరమేశ్వర్, రాథోడ్ సుభాష్ ఉన్నారు.

రాజకీయ చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

నేతకాని కులస్తులకు రాజకీయం, ఆర్థిక, ఉద్యోగ, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు నిర్వహించ తలపెట్టిన రాజకీయ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ అన్నారు. సోమవారం స్థానిక రాజకీయ చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నేతకాని కులస్తుల సమస్యలను ఎమ్మెల్యే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం నేతకాని కుల సంఘ సమన్వయ కమిటీ చైర్మెన్ కొత్తపల్లి గంగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో నివాసం ఉంటున్నారన్నారు. ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న నేతకాని కులస్తుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని అన్నారు. కేవలం ఓటుకు తప్ప ఎలాంటి పథకాలకు నోచుకోవడం లేదన్నారు. నేతకానిలను అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం చైతన్య యాత్రను చేపడుతున్నామని అన్నారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో నేతకాని కులస్తులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని కుల సంఘ జిల్లా నాయకులు జాడి రాజేష్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-సిరికొండ

ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే బోర్ వేయించారు. పోచమ్మ ఆలయంలో గత మూడు రోజుల కింద విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గ్రామస్తుల వినతి మేరకు ఆలయంలో బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఆదేశానుసారం సోమవారం స్థానిక నాయకులతో కలిసి బోర్ వేయించారు. భక్తుల కోరిక మేరకు బోర్ వేయించిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు గ్రామస్తులు, పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలాజీ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు రుద్రారపు మల్లేష్, ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న, గ్రామస్తులు ఒరగంటి పెంటన్న, గంగాధర్, బషీర్, జింక లక్ష్మణ్, బియ్యల మల్లేష్, జింక మల్లేష్, సాయిని నర్సయ్య, గొర్ల రాజన్న, తోకల రాజు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో ఫొటో ఎగ్జిబిషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో వైల్డ్ లైఫ్ ఫోటో గ్యాలరీ కార్యక్రమం నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ అనిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఫోటో గ్యాలరీలో పట్టణంలోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్‌లో 99 మంది అభ్యర్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ పేపర్ వన్ పరీక్షకు 99 మంది గైర్హాజయ్యారు. మొత్తం 335 విద్యార్థులకు గాను 236 మంది హాజరు కాగా, 99 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రాథోడ్ శ్రావణ్ నాయక్ తెలిపారు.

ఆదివాసుల మౌళిక సమస్యలను పరిష్కరించాలి

- కుమురం భీం కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కుమురం భీమ్ కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసులకు ఇంటి పత్రాలు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, రోడ్డు వంటి మౌళిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కుమురం భీమ్ కాలనీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కుమురం భీమ్ కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా అక్కడ నివాసం ఉంటున్న ఆదివాసీలకు మౌళిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, స్థానిక సంస్థల పాలనాధికారి రిజ్వాన్ భాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికి పాలక ప్రభుత్వాలు ఆదివాసులకు కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. మావల మండలం, బట్టి సావర్‌గాం శివారం సర్వే నెంబర్ 72లో 460 ఎకరాల ప్రభుత్వ భూములు ఉంటే అ ప్రభుత్వ భూములను కొంతమంది రియలే స్టేట్ వ్యాపారులు, రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూశాఖ అధికారులు కలిసి మొత్తం ప్రభుత్వ భూములను





కబ్జాలు చేస్తున్నారని అన్నారు. దొంగ పేపర్లు సృష్టించి లేఅవుట్లు, రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఇంత జరుగుతున్న నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సర్వే నెంబర్ 72లో మొత్తం 460 ఎకరాల ప్రభుత్వ భూములలో అన్ని రిజిస్ట్రేషన్‌లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిరుపేద ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కుమురం భీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసులను అక్కడి నుండి వెల్లగొట్టాలని, కొంత మంది రాజకీయ పార్టీల నాయకులు రియల్ స్టేట్, రెవెన్యూశాఖ అధికారులు కలిసి కుమ్మకై ఆదివాసులను అక్కడి నుండి వెళ్ల గొట్టాలని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. దీనిని యావత్ సమాజం ప్రజలు ,ప్రజాస్వామికవాదులు, మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు, జిల్లా ఉన్నతాధికారులు, వెంటనే స్పందించి కుమురం భీం కాలనీలో 2007 నుండి నివాసం ఉంటున్న ఆదివాసులకు ఇంటి పట్టాలు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని యెడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు, కుమురం భీం కాలనీ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆగడాలను ఆత్మీయ సమ్మేళనాల్లో నిలదీస్తాం

- ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ ప్రభుత్వ ఆగడాలను అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, వైఫల్యాలను బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ప్రజల ముందు నిలదీస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్రం భారీగా పెంచి సామాన్యుని నడ్డీ విరుస్తోందని అన్నారు. కాంగ్రెస్ హయంలో పెరిగిన పెట్రోల్ ధరలను నిరసిస్తూ, ఇదే బీజేపీ నాయకులు గతంలో ధర్నాలు చేశారని అన్నారు. క్రూడాయిల్ ధర 107 డాలర్లు ఉన్నప్పుడు పెట్రోల్ ధర రూ. 71, అని క్రూడ్ ఆయిల్ ధర రూ.65 తగ్గినప్పటికీ పెట్రోల్ ధర రూ.110 ఎందుకు ఉందని ప్రశ్నించారు. క్రూడ్ ఆయిల్ ధర ఎక్కువగా ఉన్నప్పటి కంటే తగ్గిన తర్వాతనే పెరగడాన్ని బీజేపీ వైఫల్యమని అన్నారు. రూ 450 ఉన్న గ్యాస్ ధరను ఉజ్వల పథకం కింద పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి, గ్యాస్ ధరను రూ.1200 పెంచారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం మోటార్‌లకు మీటర్లు పెడితే రూ. 30 వేల కోట్లు రాష్ట్రానికి ఇస్తామని కేసీఆర్‌కు లేఖ రాసినా ప్రజాహితం కోసం సీఎం కేసీఆర్ అందుకు నిరాకరించారని అన్నారు. దేశ సంపదను ఆదాని, అంబాని, నీరజ్ మోడీలకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఏం చేశాయని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటు వేయాలని ప్రశ్నించిన ఆయన రాబోయే రోజుల్లో ఆ



పార్టీలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ చేస్తున్న కుట్రపూరిత చర్యలను ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనల్లో గ్రామస్థాయిలో బీజేపీని ఎండగడతామని హెచ్చరించారు. బీఎల్ సంతోష్ విచారణపై స్పందించని కేంద్రం, కవిత విచారణలో దూకుడుగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబంపై అక్కసుతోనే కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలతో తమ నాయకులను వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, మైనార్టీ నాయకుడు సాజిదోద్దీన్, నాయకులు గంగారెడ్డి, జగదీష్, రాజు, భాస్కర్, మల్లేష్, భీంరావు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచ్‌లు
- నేలపై కూర్చోని ఎంపీటీసీ నిరసన

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదంటూ, అభివృద్ధి ఎలా చేయాలంటూ సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. కాంగ్రెస్ ఎంపీటీసీ అబేదా ఖానం తనకు ఎంపీటీసీ నిధులు ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారని, ఎంపీడీఓను అడిగితే స్పందించడం లేదని ఆరోపించారు. తాము గ్రామాల్లోకి వెలితే ప్రజలు అభివృద్ధిపై ప్రశ్నిస్తున్నారని తమకు న్యాయం చేయాలని సమావేశంలో నెలపై కూర్చోని నిరసన తెలిపారు. అనంతరం ముగ్గురు ఎంపీటీసీలతో వివిధ శాఖల అధికారులతో సర్వసభ్య సమావేశం కొనసాగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాదానమిచ్చారు. ముఖ్యంగా భగీరథ





నీటి సరఫరాపై చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని, భగీరథ నీరు అందించాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఎంపీడీఓ రమేష్, ఎంపీటీసీలు పరమేశ్వర్, రేణుక, కళావతి ఉత్తం, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి...

సర్పంచ్‌లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధులు రాకపోవడంతో పంచాయతీల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. చేసిన పనులకు బిల్లులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు రాకపోతే పంచాయతీల్లో అభివృద్ధి ఎలా చేయాలని వారు ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన వారిలో సర్పంచ్‌లు రాథోడ్ యశ్వంత్ రావు, రాథోడ్ సావిందర్, ఆత్రం పరమేశ్వర్, రాథోడ్ గోవింద్ నాయక్, జాదవ్ సునీత రామేశ్వర్ ఉన్నారు.

రూ.55.78 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

- కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్‌ను రూ.55.78 కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.50.48 కోట్ల అంచనా వ్యయంతో సవరించిన అంచనాలను చేపట్టడం జరిగిందని అన్నారు. 2023 జనవరి మాసాంతానికి రూ.22.42 కోట్ల వాస్తవ వ్యయం జరిగిందని తెలిపారు. మున్సిపల్ ఆర్థిక వనరులను పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు సమ్మర్ ఆక్షన్ ప్లాన్‌లో చర్చించడం జరిగిందని అన్నారు. పట్టణంలోని ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో వస్తున్న సమస్యలను అధిగమిస్తూ, లీకేజీలను గుర్తించి సరిచేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. వైస్ చైర్మెన్ జహీర్ రంజాని మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయం పెంచడానికి ప్రతిపాదించాలని, ఇప్పటివరకు తక్కువ ధరతో పన్ను వసూలు చేస్తున్న కమర్షియల్ భవనాలను గుర్తించి పన్నులు వసూలు చేయాలనీ సూచించారు. మిషన్ భగీరథ పనులు పూర్తయినప్పటికీ మున్సిపల్ ఆదీనంలో నీటి సరఫరా జరగడం లేదని సమావేశంలో తెలిపారు. అంతకుముందు మున్సిపల్ కమీషనర్ శైలజ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, ఈ ఆర్థిక సంవత్సరంలో రాబడులు, ఖర్చులు వంటి అంశాలను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకతాయిల చేష్టాలు తెలియజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని క్రీడా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి, అడిషినల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. సైబర్ నేరాలు, 1930 నంబర్ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గుడ్‌టచ్, బాడ్‌టచ్, క్యూఆర్ కోడ్, ఫోక్స్ యాక్ట్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురైతే షీటీమ్ నెంబర్ 8712659953 ఫోన్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వజ్రమాల విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ వరం

- ఎంపీపీ కనక మోతుబాయి



నవతెలంగాణ-నార్నూర్

పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ ఒక వరమని ఎంపీపీ కనక మోతూబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 30 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ అమృత్ లాల్, ఎంపీటీసీలు కళావతి, ఉత్తం, రేణుక, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలో 843 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పరీక్షలు ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలలో ఐదో రోజు సోమవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షకు 843 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ వెల్లడించారు. మొత్తం 10, 888 మందికి గాను 10, 045 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

గిరిజన దర్బార్‌లో అర్జీలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన దర్బార్‌కి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ భీంరావు, డీడీ దిలీప్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో అర్జీలను స్వీకరించారు. కడెం మండలం గోండుగూడకు చెందిన కుర్సంగ సూర్య తమ గ్రామంలో 11 మంది గిరిజన మత్సకారులకు ద్విచక్ర వాహనాలు ఇప్పించాలని కోరారు. కోటపెల్లి మండలం సర్వాయి పేట గ్రామానికి చెందిన గుగ్లోత్ సమ్మయ్య నాయక్ ట్రైకార్ రుణం మంజూరు చేయాలని అర్జీని అందించారు. ఇచ్చోడ మండలం దుబార్‌పేటకు చెందిన చాకటి రమేష్, సాథ్‌నంబర్ గ్రామానికి చెందిన జాదవ్ రావ్ సింగ్ తమకు స్వయం ఉపాధికి రుణం మంజూరు చేయాలని కోరారు. రైతుబంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ దర్బార్‌లో అదనపు వైద్యఆరోగ్య శాఖ అధికారి కుమురం బాలు, ఓఎస్డీ క్రిష్ణయ్య, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీఓ ప్రవీణ్, హెచ్ఓ సుధీర్, అధికారులు పాల్గొన్నారు.

లీకేజీ ఘటనపై నిరుద్యోగుల రాస్తారోకో

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల కోసం యువత రోడ్డు మీదకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. పేపర్ లీకేజీ ఘటనపై కేటీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ఆదిలాబాద్ బీసీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతతో కలిసి స్టడీ సర్కిల్ ఎదుట పాత జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన పలు పరీక్షలలో లీకేజీ వ్యవహారం వల్ల నిర్యుదోగులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోందని అన్నారు. దీనిపై కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై సీబీఐ ద్వారా విచారణ చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. అలాగే ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగులు ఒక్కొక్కరికి రూ.2లక్షలు ఎక్స్‌గ్రెషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో వల్ల పట్టణంలో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు నాయకులను మావల పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
మంగళవారం 21 మార్చి 2023

పొన్కల్ దిన, వార, సంతకు వేలం పాట

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతా, ప్రతిరోజు నిర్వహిస్తున్న దిన సంతకు ఈనెల 23వ తేదీన వేలం పాట నిర్వహించడం జరుగుతుందని, ఆ గ్రామ సర్పంచ్ జక్కు భూమేష్ గుప్తా ,ఈవో రాహుల్ గుప్తా, సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. (2023-24) సంవత్సరానికి గాను ఈ వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు 23వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారసంతకు రూ.20000, దిన సంతకు రూ.10 వేలు డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వేలం పాటలో ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఆర్ఎస్‌పై అవగాహన

నవతెలంగాణ-వేమనపల్లి



వేమనపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆస్పత్రిలో అకస్మాత్తుగా మనిషికి గుండెపోటు వస్తే ఎలా సీపీఆర్ఎస్ చేసి ప్రాణాలు కాపాడే విధానంపై సోమవారం ఆస్పత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో గుండె పోటు వస్తే తక్షణమే స్పందించి సీపీఆర్ఎస్ చేయు విధానాన్ని వివరించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు తగు సలహాలు సూచనలు చేశారు. ఎవరికైనా గుండె పోటు వస్తే ఆందోళన చెందకుండా సీపీఆర్ఎస్ చేయడం ద్వారా ప్రాణాలు కపడవచ్చని అన్నారు.

అటవీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్, తహసీల్దార్ కిషన్

నవతెలంగాణ-జన్నారం



అటవీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జన్నారం రేంజ్ అధికారి ఆఫీస్ ఉద్దీన్ తహసీల్దార్ ఇట్యాల కిషన్ అన్నారు. సోమవారం మండలంలోని పులుల రక్షిత ప్రాంతంలో, అటవీ నేరాలు అనగా, వన్యప్రాణుల వేట, అక్రమ కలప రవాణా, పోడు వ్యవసాయం అక్రమ చెట్ల నరికివేత, అడవి జంతువులను హతమార్చుట, నేరాలు చేసిన చింతాగుడా, బొమ్మెన, పైడిపల్లి, కిష్టాపూర్, దేవునిగూడెం, రేండ్లగూడ, కవ్వాల్, కొత్తపేట, గ్రామాలకు చెందిన పలువురు అటవీ నేరస్తులను సోమవారం మండల తహసీల్దార్ ఇట్యాల కిషన్ ముందు ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్ బైండ్ ఓవర్ చేశారు. సందర్భంగా తహసీల్దార్ కిషన్ వారికి పలు సూచనలు చేశారు. ఇక ముందు అటవీ నేరాలకు పాల్పడితే రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు. రెండు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. ఇకముందు, ఎలాంటి అటవీ నేరాలకు పాల్పడకుండా ఉండాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శివకుమార్, ఎఫ్‌బీఓ అనిల్, భోజ, సతీష్, సాయి కుమార్, కిరణ్మయి, రాయిముద్దీన్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటి వెలుగును వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జంగం కళ, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. సోమవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ 12వ వార్డు గాంధీనగర్‌లోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని 12వ వార్డు కౌన్సిలర్ బొద్దుల రమ్య, ప్రేమ్ సాగర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వార్డులో కంటి శిబిరాన్ని రెండు రోజులు పాటు నిర్వహిస్తారని, కంటి శిబిరాన్ని వార్డు ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, మేనేజర్ నాగరాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదెలు, గడ్డం సంపత్, జాడి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు జక్కనబోయిన మంజుల కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వసంత్, డాక్టర్ శ్యామల, ఏఎన్ఎం మంగ, ఆర్‌పి శ్యామల, అంగన్‌వాడీ టీచర్ విక్టోరియా పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి సెర్ప్ ఉద్యోగుల పాలాభిషేకం

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం జీఓ నెం.11ను విడుదల చేయడంతో ఆ శాఖ ఉద్యోగులు సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని స్థానిక సెర్ప్ కార్యాలయ ఆవరణలో ఏపీఎం లక్ష్మీ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం లక్ష్మీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని కొనియాడారు. సీఎం కేసీఆర్‌కు సెర్ప్ ఉద్యోగులు రుణపడి ఉన్నారని తెలిపారు. మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవడం అభినందనీయమన్నారు. జిల్లాలోని 118 మందికి ఈ పే స్కేల్ వలన లబ్ది చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు అవునూరి లచ్చన్న, సురేందర్, వసంత లక్ష్మీ సుమలత, రాజమణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జమున, కార్యదర్శి జమున, కోశాధికారి లక్ష్మీ పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో జిల్లా నాయకుడు పోల్కర్ సాయిరాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో అనంతపూర్ జిల్లా కదిరి నియోజకవర్గంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా నాయకులు పోల్కర్ సాయిరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. లోకేష్ స్పందిస్తూ తెలంగాణలో విద్యారంగ సమస్యలపై పోరాటం చేయాలని తిరిగి పార్టీకి తెలంగాణలో పూర్వ వైభవం తీసుకువచ్చేలా కష్టపడాలని యువతకి పెద్దపీట వేసి సహకరిస్తానని చెప్పినట్లు వివరించారు. ఈ పాదయాత్రలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పర్లపల్లి రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు అనుకున్న లక్షలు సాధించాలని మజిలిస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ సల్మాన్ ఖాన్ ప్రధాన కార్యదర్శి మీర్ కషిప్ అలీ హష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా కష్టపడి చదవాలని, ప్రతిఒక్కరు విద్యలో రాణించడమే కాకుండా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శులు షేక్ అరిఫ్, ఎండీ అఫ్జల్, షకీల్ అహ్మద్, కోశాధికారి మొహమ్మద్ పాషా, సీనియర్ నాయకులు అజీమ్ ఉద్దిన్, కార్యకర్తలు ఐమాన్ అమూది, శాబాజ్, అఫ్రోజ్ ఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ నిజాం, ఉపాధ్యాయులు ప్రకాష్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షల్లో మరో విద్యార్థి డిబార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో సోమవారం కాగజ్‌నగర్ కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఒక విద్యార్థిని మాల్ ప్రాక్టీస్ కింద డిబార్ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో నలుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ కింద పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. జిల్లా విద్యాధికారి శ్రీధర్ సుమన్ వివరాలు వెల్లడిస్తూ సోమవారం నుండి గణితం, బాటనీ, సివిక్స్ సబ్జెక్టులతో ఐచ్ఛికాంశాల పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా జనరల్ 4567, ఒకేషనల్ 812 మొత్తం 5379 మంది విద్యార్థులకు గాను జనరల్ 4320, ఒకేషనల్ 706 మంది మొత్తం 526 మంది విద్యార్థులు హాజరయ్యారని, మొత్తం 353 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లాలోని రెబ్బెన, ఆసిఫాబాద్‌లోని పలు పరీక్షా కేంద్రాలను డీఈసీ బృందర సభ్యులు సందర్శించినట్లు వివరించారు. ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్ మినహా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల తనిఖీల్లో డిఇసి బందం సభ్యులు శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

జన చైతన్య

యాత్రను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య

నవతెలంగాణ-జైపూర్



జైపూర్‌లో..

మతోన్మాద భారతీయ జనతా పార్టీ కార్పొరేట్ విధానాలు వ్యతిరేకిస్తూ సంక్షేమం, మత సామరస్యం, సామాజిక న్యాయం కోసం బీజేపీ విధానాలను ఎండగడుతూ మార్చి 25న మంచిర్యాల జిల్లాలో జరిగే జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు ఆశయ్య పిలునిచ్చారు. ఈ మేరకు జన చైతన్య బస్సు యాత్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం చెన్నూర్ చెరువు కట్ట సమీపంలో గల శివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన చైత్య యాత్ర రథసారధిగా ఎస్ వీరయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కమిటి సభుయలు ఈ బస్సు యాత్రలో ఉంటారని, బస్సు యాత్రను ప్రజలు, కార్మికులు, లౌకికవాదులు, సామాజిక సంఘాల నాయకులు, మహిళలు, మేధావులు, విద్యార్థులు యువత అధిక సంఖ్యంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటి సభ్యులు బోడెంకి చందు, కోటపల్లి మండల కార్యదర్శి కావేరి రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జక్కుల మారన్న, కుందారం చంద్రన్న తిరుపతి, మనీ, వైశాలి, గిరెల్లి రాజేష్, అట్టెం రాధిక పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని పొనకల్ గ్రామ పంచాయితీ పరిధిలోని,



జన్నారంలో..

రామాలయం వాడలో సీపీఐ(ఎం) మండల శాఖ ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర పోస్టర్లను సోమవారం ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. మండల కార్యదర్శి కనికరపు అశోక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు జన చైతన్య యాత్ర కార్యక్రమాన్ని సీపీఐ(ఎం) నిర్వహిస్తుందని తెలిపారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, కార్మిక హక్కులు, చట్టాల రక్షణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు తదితర అంశాలపై ఈ యాత్ర సాగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరణ, ఉపాధి హామీ బడ్జెట్ కేటాయించి పని దినాలు 200 రోజులు పెంచి, కనీస వేతనం రూ.600 నిర్ణయించుట, ధరల పెరుగుదల నియంత్రించి, రైతు పండించే అన్ని పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల నిండిన వారందరికీ పెన్షన్ అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, తదితర సమస్యల సాధన కోసం ఈ నెల 25న మంచిర్యాలకు వస్తున్న సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను తెలంగాణకు రాకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు కూకట్‌కర్ బుచ్చయ్య, ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకులు పోతు విజయశంకర్, మండల నాయకులు గుడ్ల రాజన్న, వొడిపల్లి ప్రమీల, పర్ల కనకయ్య పాల్గొన్నారు.

అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని..గర్భవతిని చేసి..

నవతెలంగాణ-కెరమెరి



ఆసిఫాబాద్‌లో మృతదేహంతో రోడ్డుపై బైటాయించిన తుడుందెబ్బ గిరిజన నాయకులు

ఆదివాసీ యువతి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గర్భవతిని చేసిన ఘటన వెలుగు చూసింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని అగర్వాడ గ్రామానికి చెందిన జుగ్నాక రేణుక నిర్మల్‌లో ఎఎన్ఎంగా పని చేస్తోంది. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని లక్ష్మీదేవిపేట్‌కు చెందిన జాలోత్ రమేష్(32) నిర్మల్ లో పాన్‌షాప్ నడుపుతున్నాడు. 2014 నుండి రేణుకతో ప్రేమలో ఉన్నాడు. 2018లో కుటుంబ సభ్యుకు తెలియకుండా రేణుకను పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో రేణుక గర్భం దాల్చింది. డెలివరి కోసం శస్త్ర చికిత్స చేస్తుండగా ఆమె మరణించింది. దీంతో సోమవారం ఆమె మృతదేహాన్ని మండల శివారు వదిలిపెట్టి వెళ్లడంతో విషయం వెలుగు చూసింది. కూతురు మృతికి రమేష్ కారణమని తండ్రి ఆరోపిస్తున్నాడు. అతనిపై చట్టపరపైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాలు, తుడుం దెబ్బ నాయకులు జిల్లా కేంద్రంలో ధర్నా చేసినప్పటికీ అమ్మాయి కుటుంబానికి ఎటువంటి ఆసరా దొరకలేదు.



మృత దేహంతో రోడ్డుపై బైటాయింపు

ఆసిఫాబాద్ : జిల్లాలోని కెరమరి మండలం అగర్వాడ గ్రామానికి చెందిన జుగ్నాక రేణుక మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ డిమాండ్ చేశారు. మహిళ మృతిని నిరసిస్తూ మృతదేహంతో ఆదివాసి సంఘాలు తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతిని గత కొన్ని సంవత్సరాలుగా రమేష్ అనే వ్యక్తి మాయమాటలు చెప్పి లోవర్చుకున్నాడని ఇదే క్రమంలో యువతి గర్భం దాల్చిందన్నారు. అయితే శస్త్ర చికిత్స చేస్తున్న క్రమంలో నిర్మల్ ఆసుపత్రిలో యువతి మరణించిందని, విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపి కెరమెరి మండల శివారులో తల్లిదండ్రులకు మృతదేహాన్ని వదిలి వెళ్లారని అన్నారు. యువతి మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయనను ఉరితీయాలని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళ తండ్రి లచ్చు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ధర్నాలో ఆదివాసి తుడుం దెబ్బ నాయకులు తుకారం, లచ్చు, సోము, సోనేరావు, భీంరావు, అనంతరావు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ అటెండర్ రాంచందర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసి సంక్షేమ పథకాలు అమలుచేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 27న చలో హైదరాబాద్ లేబర్ కమీషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని హమాలీ వర్కర్లను కోరారు. హమాలీలందరికి భవన నిర్మాణ కార్మికుల వలే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసి 50 కిలోలకు మించిన బరువులు నిషేధించాలన్నారు. పని భద్రత, గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా, ఆరోగ్యబీమా కల్పించి ప్రభుత్వ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. హమాలీలకు ఇండ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని, వారికున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 5 లక్షల మంది హమాలీలు పనిచేస్తున్నారని, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు గోదాంలలో పనిచేస్తున్న సివిల్ సప్లై, హెచ్ఫ్సై, సిమెంటు గోదాంలు, పండ్ల మార్కెట్, ఇసుక, కంకర క్వారీలు, రైల్వే, ఆర్టీసీలలో పనిచేస్తున్న హమాలీలకు ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. 55 ఏండ్ల వయసు పైబడిన హమాలీలకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు ప్రదేశాల్లో హమాలీల కోసం మూత్రశాలలు, విశ్రాంతి గదులు ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికుల మండలాధ్యక్షుడు పెరుగు విఠల్, మండల నాయకులు మడె పోశన్న, నాయిని సిద్దేశ్, ఇగురపు శంకర్, నాయిని మల్లేష్, సురేష్, దేవాజీ, సతీష్, పలువురు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

తాండూర్ : గ్రామాల్లో అధిక విలువలు కలిగిన పోషకాహారంపై అవగాహన కల్పించాలని సీడీపీఓ ఉమాదేవి తెలిపారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో చిరుధాన్యాలు తృణధాన్యాలను పండించుకొని తినే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. కోవిడ్ నేపథ్యంలో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవలసిన ఆవశ్యకత ఏర్పడిందని దానికి అనుగుణంగా ఐసీడీఎస్ ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. గర్భిణీలు రోజువారి ఆహారంలో జొన్నలు, గోధుమలు, పెసర్లు, బొబ్బర్లు, రాగుల వంటి అధిక ప్రోటీన్లు ఫైబర్ కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. సులువుగా జీర్ణమైయ్యే తాజా కూరగాయలు, ఆకుకూరలు వాడే విధంగా ప్రోత్సహించాలన్నారు. పోషణ మాసంలో భాగంగా ప్రతిరోజు గృహ సందర్శనలు పిల్లలతో ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, స్వరూప రాణి, అంగన్వాడి టీచర్లు శారదా, ప్రమీల, మీనా, అమృత, విజయ పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ యువతి మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎంబడి సాయిష్మ(22) అనే యువతి ఈ నెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా సోమవారం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దండేపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన నలిమెల వినయ్ అనే యువకుడు గత సంవత్సర కాలంగా ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. సాయిష్మకు ఈనెల 13న నిశ్చితార్థం అవడంతో 18న మృతురాలు సాయిష్మకు ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినట్లు తెలిపారు. లేకుంటే పరువు తీస్తానని చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మనస్థాపం చెంది వినయ్‌తో ఫోన్లో మాట్లాడుతూనే సాయిష్మ ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. వినయ్ వెంటనే తన స్నేహితునికి తెలియజేయగా అతను అదే గ్రామానికి చెందిన బోడకుంటి సత్తయ్య అనే వ్యక్తికి సమాచారం అందించాడు. వెంటనే మేదరిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతురాలు బంధువు ఎంబడి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

గనిలో అదనపు బొగ్గు నిల్వలు తీసేందుకు అనుమతి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గని జీవిత కాలం మరో మూడేళ్లు పెరిగినట్లు శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. గని సీ డిప్‌లోని బొగ్గు నిల్వలు వెలికి తీసేందుకు అనుమతులు వచ్చిన నేపథ్యంలో సోమవారం గని ఆవరణలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. గని మేనేజర్ ఇ.స్వామిరాజు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి, ఎస్ఓటు జీఎం ఎం.త్యాగరాజు, తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, ఆర్కే-7 గనుల గ్రూపు ఏజెంట్ ఎస్.సత్యనారాయణ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జీఎం బి. సంజీవరెడ్డి మాట్లాడుతూ ఆర్కే-న్యూటెక్ గనిలో సీ డిప్‌కు అనుమతులు వచ్చి గని జీవిత కాలం మరో మూడేళ్లు పెరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ గనులను కాపాడుకోవల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కొత్తగా వస్తున్న ఉద్యోగులు వృత్తి నైపుణ్యాలు పెంచుకొనేందుకు దృష్టి సారించాలని సూచించారు. పని స్థలాల్లో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. 41 రోజుల ముందుగానే గని వార్షిక నిర్దేశిత లక్ష్యం చేరుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. యువ ఉద్యోగులు క్యాటగిరి లెటర్లు తీసుకొనేందుకు ముందుకు రావాలని కోరారు. కష్టమైన పనుల్లో నైపుణ్యం సాధిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు మరింత కష్టపడి కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి, ఏజెంట్ ఎస్.సత్యనారాయణ, మేనేజర్ స్వామిరాజు గనిలోకి వెళ్లి పని స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రతినిధి బుస్స రమేష్, గ్రూపు ఇంజినీర్ రవిచరణ్, రక్షణాధికారి శ్రీ కొట్టె రమేష్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ ఇంజినీర్ రాజగోపాలచారి, వెంటిలేషన్ అధికారి శంకరయ్య, జేఓ స్టాన్లీ జోన్స్, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, అండర్ మేనేజర్ మిట్టపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడ పాఠశాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకులు మణెమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించిన చివరి దశ ఉమ్మడి జిల్లాలో బాలికల ఎంపిక పోటీలను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి విద్యతో పాటు ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గిరిజన విద్యార్థినులకు ప్రత్యేక గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిని గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా పారదర్శకంగా ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గత నెలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వారి జిల్లాస్థాయి క్రీడ పాఠశాలల ప్రవేశ ఎంపిక పోటీలు నిర్వహించుకొని, అక్కడ మంచి ప్రతిభ, నైపుణ్యం కనపరచిన బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఎంపిక పోటీలలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాల నుంచి 151 మంది బాలికలు పాల్గొన్నారని తెలిపారు. ఈ ఎంపిక పోటీల ప్రక్రియను ఏసీఎంఓ ఉద్దవ్, ఆసిఫాబాద్ డివిజన్ ఏటిడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మధుసూదన్, క్రీడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు పర్యవేక్షించగా ఈ కార్యక్రమంలో తెలంగాణ పేట జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పీడీలు మీనారెడ్డి, బిక్కు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టిక ఆహారాన్ని, గర్భిణీలు బాలింతలు కిశోర బాలికలు తప్పకుండా తీసుకోవాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణీ బాలింతలకు కిశోర బాలికలకు గుడ్లు, బాలామృతం, పాలు ఇతర పౌష్టికాహారాన్ని అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలన్నారు. పుట్టిన పిల్లలకు ఈ ఆహారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గర్భిణీలు, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గర్భిణీ బాలింతలు వీటితోపాటు మాంసాహారం, పాలు, పండ్లు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జాడి సంజీవరాణి ఆయా మమత పాల్గొన్నారు.

అర్హురాలికే అంగన్‌వాడీ టీచర్ పోస్టు కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని వార్డు నెంబర్ 22లోని అంగన్‌వాడీ కేంద్రంలో అర్హురాలికే టీచర్ పోస్టు కేటాయించాలని ఆ వార్డు కౌన్సిలర్ లావణ్య శరత్ ముదిరాజ్ సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కాడేకు వినతిపత్రం ఇచ్చారు. వార్డు నెంబర్ 22లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు ఖాళీ ఏర్పడడంతో పదోన్నతుల ప్రక్రియలో భాగంగా వార్డు నెంబర్ 24 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న దుర్గం యోగిత ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. జీఓ మేరకు అన్ని అర్హతలున్న దుర్గం యోగితను ఈ పోస్టుకు ఎంపిక చేసి న్యాయం చేయాలని ఆమె కోరారు.

చెరువులో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-గుడిహత్నూర్



మండలంలోని ముత్నూరు, ధామన్‌గూడ గ్రామాల మధ్య గల చెరువులో ప్రమాదవశాత్తు ధోని కృష్ణ(23) అనే యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్టు ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కృష్ణ అతని స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి చెరువుకు వెళ్లారు. మిత్రులతో చెరువులో దిగడంతో ప్రమాదవశాత్తు జారిపోగా ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. సోమవారం మృతదేహం నీటిపైకి తేలడంతో అక్కడ పనిచేస్తున్న కొందరు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లి మతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా నిర్వహించి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పశుమిత్రలకు కనీస వేతనం నిర్ణయించాలి



నవతెలంగాణ-నిర్మల్

పశు మిత్రలకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట పశుమిత్ర వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వరుణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించే పాడి, పరిశ్రమకు పశుమిత్రులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోవడం సరైనది కాదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో 2,500 మంది గత ఎనిమిది సంవత్సరాల నుండి వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారేనని, ముఖ్యంగా వీళ్లంతా మహిళలు అయినప్పటికీ ప్రభుత్వం కనీసం కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వడం లేదని అన్నారు. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని యూనిఫామ్ లు, గ్లౌజులు, మాస్కులు, కిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని భద్రతా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీ ఇంద్ర, వినోద, జ్యోతిలక్ష్మి, సవిత్రి, కవిత, గంగమణి, మమత, రమ, నాగజ్యోతి పాల్గొన్నారు.

దేవాపూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే చిన్నయ్య



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ గ్రామంలో సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పర్యటించారు. ఈ సందర్భంగా దేవాపూర్‌లో రూ.15 లక్షల నిధులతో మసీద్ పున:నిర్మాణం పనులను ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రారంభించారు. ముందుగా దేవాపూర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించి వసతులపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ తెలంగాణాలో ముస్లిం, హిందువులు అన్నదమ్ములలా కలిసి ఉంటున్నారని, బీజేపీ కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెట్టాలని చేస్తుందన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని, దీనిని తిప్పి కొట్టి కలిసి కట్టుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని సామాజిక వర్గాల అభివద్ధే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, అనంతరావు, ఏ.శ్రీనివాస్, ఎంపీటీసీ పద్మ, వడ్లూరి మల్లేశ్, పురుషోత్తం, రాందాస్, చందు, ధర్మారావు, అశోక్, అనీల్, నరేశ్, సంజీవ్, వేణు, విజయ్, సతీశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

వసతిగృహ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీసీ వసతిగృహాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యారంగ సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా ఆయన సోమవారం కాగజ్‌నగర్‌లోని బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షానికి వసతిగృహం ఆవరణ మొత్తం నీటిమయంగా మారిందనీ, పక్కా భవనం కూడా నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్గం వెంకటేష్, ప్రశాంత్, పవన్, సాయిచరణ్ పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

నవతెలంగాణ-కోటపల్లి

హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదీతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా సెషన్ కోర్టు తీర్పించిందని కోటపల్లి మండల పోలీసులు పేర్కొన్నారు. మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన గుగులోతు సునీతతో చెన్నూరు చెందిన రాజ్ కుమార్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అనుమానంతో 2018 ఫిబ్రవరి 14న రాజ్ కుమార్‌ను గోగులోతు సర్వా నాయక్ గొడ్డలితో హతమార్చాడంతో జీవిత ఖైదు విదించినట్టు తెలిపారు. ఈ కేసులో కమల బాయ్, ఉదయ్, మరికొందరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దీనితో మార్చి 20 2023 సోమవారం సెషన్ కోర్టు మంచిర్యాల తుది తీర్పు వెల్లడించింది.

చలివేంద్రాన్ని ప్రారంభించిన జడ్పీటీసీ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జాం గ్రామంలో జడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండకు అందుబాటులో ఉండే చలివేంద్రాలతో ప్రజల దాహార్తి తీరుతుందన్నారు. ముఖ్యంగా ప్రయాణికుల దాహం తీర్చడానికి ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం నూతన గ్రామపంచాయతీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురళీకృష్ణ, ఉప సర్పంచ్ కరికె విలాస్, ఎంపీటీసీ వనజాశేఖర్, వార్డు సభ్యులు వెలిశాలి తిరుమలచారి, కో ఆప్షన్ సభ్యులు కండెల భూమన్న, దినేష్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతకు దారి తీసిన 'డబుల్' ఆందోళన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై ఆందోళన రోజు రోజుకు పెరుగుతోంది. అక్రమాలపై నిరసన వ్యక్తం చేస్తూ బీజేపీ సోమవారం చేపట్టిన మున్సిపల్ కార్యాలయం ముట్టడి కాగజ్‌నగర్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, దీనిని నిరసిస్తూ బీజేపీ నేత పాల్వాయి హరీష్‌బాబు మున్సిపల్ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తూ, అన్ని వార్డులలో ఇండ్లు దక్కని అర్హులైన పేదలు ఈ ముట్టడికి తరలిరావాలని కోరారు. దీనితో పోలీసులు ఉదయం నుండే అన్ని వార్డులలో తిరుగుతూ అర్హులైన పేదలను మున్సిపల్ కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నారు. పాల్వాయి హరీష్‌బాబు ఇంటి ముందు ఉదయం నుండే పోలీసులు మోహరించారు. కాని హరీష్‌బాబు రాత్రి నుండే ఇంట్లో లేకుండా ఇతర ప్రాంతంలో ఉండడంతో పోలీసులు ఆయన కోసం పట్టణంలో గాలించారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రెండు దారుల వద్ద పోలీసులను మోహరించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ బుద్దె స్వామి, రూరల్ సీఐ నాగరాజు, టౌన్ ఎస్సైలు చంద్రశేఖర్, రాజ్యలక్ష్మి, రూరల్ ఎస్సై సానియా, బెజ్జూరు ఎస్సై వెంకటేష్, ఈజ్‌గాం ఎస్సై చంద్రశేఖర్‌లు తమ బలగాలతో మోహరించారు. మున్సిపల్ కార్యాలయం వైపు వెళ్లే ప్రతీ ఒక్కరిని అడ్డుకున్నారు. ఆందోళనలో పాల్గొనేందుకు వచ్చిన మహిళలను అక్కడి నుండి దూరంగా పంపించి వేశారు. 11:30 గంటలకు అకస్మాత్తుగా ద్విచక్రవాహనంపై పాల్వాయి హరీష్‌బాబు వచ్చి మున్సిపల్ కార్యాలయం వైపు వెళ్లే ప్రయత్నం చేయగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొని పోలీసు వాహనంలో ఎక్కించే ప్రయత్నం చేయగా, ఆయన తప్పించుకొని అక్కడే రోడ్డుపై పడుకున్నారు. వెంటనే పోలీసు బలగాలు ఆయనను ఎత్తి పోలీసు వాహనంలో పడేసే ప్రయత్నం చేయగా అక్కడే ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాని భారీగా ఉన్న పోలీసు బలగాలు అందరిని నెట్టివేసి ఆయనను పోలీసు వాహనంలో తరలించారు. పోలీసు వాహనాన్ని అడ్డుకున్న కార్యకర్తలను దూరంగా నెట్టివేసి వెంటనే హరీష్‌బాబును వాంకిడి పోలీసుస్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ తోపులాటలో టౌన్ సీఐ బుద్దె స్వామి నడుముకు ఉన్న బుల్లెట్‌లు భద్రపరిచే మేగజైన్ కిందపడింది. దానిపై నుండే పోలీసు వాహనం వెళ్లడంతో అది ధ్వంసమై అందులోనుండి బుల్లెట్‌లు రోడ్డుపై పడ్డాయి. వెంటనే అప్రమత్తమైన సీఐ ఆ బుల్లెట్‌లను తీసి తిరిగి మేగజైన్‌లో భద్రపరుచుకున్నారు.

ఆదివాసులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-సిరికొండ

ఆదివాసులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎస్పీకి గ్రామస్తులు స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువును మధ్యలోనే ఆపేసి గ్రామాలలో ఖాళీగా తిరగకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న సదావకాశాలు వినియోగించుకొని, ప్రతి ఒక్క యువకుడు తన వంతుగా ఏదో ఒక ఉద్యోగాన్ని సాధించి, వారి కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు. పోలీసు శాఖ తరఫున నిర్వహించే ఉచిత శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యపడుతుందని అన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ శాఖను సంప్రదించాలని, తప్పకుండా తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామని అన్నారు. వైద్య శిబిరానికి దాదాపుగా 20 గ్రామాల నుండి 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ నైలు, ఎస్సైలు నిరేష్, సునీల్, జెడ్పీటీసీ చంద్రకళ, ఆదిలాబాద్ సూపర్ స్పెషాలిటీ, ఉట్నూర్, పిట్ట బొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్యులు దీపక్ పుష్కర్, వీణా, రవి రాథోడ్, ప్రతాప్ నాయక్, సర్పంచ్ రఘురాం పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి, పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలోని అర్జీలను పరిశీలించి, దరఖాస్తుదారునికి సవివరమైన సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుండి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుని సమస్యకు పరిష్కారం చూపే విధంగా సమాధానం అధికారులు అందించాలని అన్నారు. తద్వారా దరఖాస్తుదారు అదే సమస్యపై తిరిగి ప్రజావాణికి రాకుండా జరుగుతుందని అన్నారు. గత మాసాంతం వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను అరవై శాతం పరిష్కరించామని అన్నారు. ఇంకను 834 అర్జీలు వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని పరిశీలించి, సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమం, పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ శాఖల్లో ఎక్కువ మొత్తంలో పెండింగ్ ఉన్నాయని, వాటిని వచ్చే వారం నాటికి పరిష్కరించే విధంగా చూడాలని అన్నారు. ఈ ప్రజావాణిలో పెన్షన్స్, భూ సంబంధ సమస్యలు, ఉపాధి కల్పనా, తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించి వాటి పరిష్కారానికి ఆ శాఖాధికారులకు పంపించారు. గ్రూప్స్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సౌకర్యార్థం జిల్లా గ్రంథాలయాన్ని 24 గంటల పాటు తెరచి ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని గ్రంథాలయ కార్యదర్శి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రంథాలయంలో సుమారు 350 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. వారికీ సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లలో గ్రూప్స్ పరీక్షల సన్నద్ధానికి సౌకర్యాలు కల్పించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, జెడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ శ్రీనివాస్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, కె.భాస్కర్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో గ్రామస్తులు నిరసన



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామంలోని ఎస్సీ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కవిత రాజేష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెడితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో తాగురు అందటం లేదని ఆరోపించారు. గత నెల రోజుల నుంచి ఎస్సీ కాలనీలో నీరు సరఫరా కావడం లేదని పలు మార్లు అధికారులకు నాయకుల దృష్టికి తీసుకువెళ్లనా ఫలితం లేదన్నారు. దింతో ఎంపీడీఓ కవిరాజ్‌కు గ్రామ సమస్యను వివరించి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా మంచి నీళ్ళు అందించేలా చూడలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ మిషన్ భగీరథ అధికారిని పిలిపించి సమస్యను ఒక్కరోజులో పరిషకరించేలా చూడలని అధికారికి సూచించారు.

అక్రమ అరెస్టులు సరికాదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై బీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలిపే హక్కు కూడా లేదా : పట్టణ అధ్యక్షుడు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపేందుకు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని, ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కును కూడా అధికారపార్టీ హరించివేస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్ విమర్శించారు. తమ నేత పాల్వాయి హరీష్‌బాబు పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అర్హులకు కేటాయించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీ ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న దళితుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఉసేగావ్ చౌరస్తా వద్ద సీఎల్పీ నేత మల్లు భటి విక్రమార్కకు దళిత హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు శేఖర్ వినతిపత్రం అందించారు. దళితులకు పహాణీలపై రైతుబంధు, రైతుబీమా అందించే విధంగా అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. దీనికి ఆయన వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, దళిత, గిరిజన గిరిజనేతరుల అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సీహెచ్‌సీలలో వైద్యులను నియమించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులను నియమించాలని జమా ఉర్దు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వామికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండి రెహమాన్ మాట్లాడుతూ చాలా కాలంగా ఆసుపత్రులలో సరైన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రితో సహా జిల్లాలోని అన్ని ఆసుపత్రులలో సరిపడా వైద్యులను నియమించాలన్నారు. అలాగే అన్ని ఆసుపత్రులలో ఉర్దూ సైన్ బోర్డ్, అవసరమైన అన్ని ఇతర సమాచారానికి సంబంధిత సూచిక బోర్డు ఉర్దూ భాషలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమా ఉర్దూ ఫౌండేషన్ కార్యదర్శి ఎండి రియాజ్ అలీ, ఎండి ఖాదర్ ఉజ్ జమా, ఎండి అసద్ ఉజ్ జమా, ఇంతియాజ్ సాబరి, అబ్దుల్ ముబషీర్ పాల్గొన్నారు.

కాసిపేటలో ప్రజావాణి



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజావాణిలో పలు సమస్యలపై వచ్చిన వారి దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై దరఖాస్తులు చేసుకుంటే, పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ఎంపీడీఓ ఎంఎ అలీం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఏఓ వందన పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ-నేరడిగొండ

గత రెండు రోజులుగా క్రితం కురిసిన అకాల వర్షాలు పడగండ్ల వానతో మొక్కజొన్న జొన్న పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు స్వరాజ్యం వేదిక జిల్లా అధ్యక్షులు సంఘం డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి పంట పొలాలను రైతుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరడిగొండ మండలంలోని కుప్టి, బోత్, ఇచ్చోడా మండలంలో దాదాపు 6000 ఎకరాలపైగా పంట నష్టపరిహారం జరిగిందన్నారు. గత 2020 సంవత్సరం నుండి నేటి వరకు మన రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్, యాసంగి పంట భీమల పథకాన్ని ఎత్తివేసిందన్నారు. 2005 సంవత్సరంలో సుప్రీంకోర్టు చట్ట ప్రకారం మన జిల్లా కలెక్టర్ వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసే అధికారం ఉన్న తాను ఇప్పటివరకు కూడా వ్యవసాయ అధికారులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా క్లస్టర్‌ల వారిగా రైతుల వివరాల ప్రకారం సర్వే చేసి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించే విధంగా కషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ యంత్రంగానికి వ్యవసాయ శాఖ రిపోర్ట్ పంపించాలని అన్నారు. కార్యక్రమంలో రైతులు భూమేష్, భోజన్న, వెంకటరమణ, జ్ఞానేశ్వర్లు పాల్గొన్నారు.

నష్టపోయిన మామిడి పంటల పరిశీలన

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని మామిడి తోటలను ఉద్యానవన శాఖ మంచిర్యాల జిల్లా క్లస్టర్ అధికారిని సహజ సోమవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి మామిడి పంట నేలరాలగా ఆమె నేలరాలిన మామిడి కాయలను పరిశీలించారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షానికి 50 శాతం కాయలు నేలరాలయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటను అంచనావేసి నష్టపరిహారం అందే విధంగా చూడాలని రైతులు ఆమె కోరారదు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన పంట వివరాలు నమోదు చేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పంట నష్టపరిహారం అదే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

చిరు ధాన్యాలు తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి జెడ్పీటీసీ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో లభించే పౌష్టిక ఆహారంతోపాటు చిరుధాన్యాలు తిని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఆరోగ్యమైన భారతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపిఓ తిరుపతిరెడ్డి, సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్‌రెడ్డి, డాక్టర్ వేదవ్యాస్, ఐకేపీ ఎపిఎం మాధురి, అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయగౌరీ, అంగన్వాడీ టీచర్లు, రేఖరాణి, రాజ్యలక్ష్మి, భాగ్య, రాధ, శైలజ, జ్యోతి అన్నపూర్ణ, సుమన్‌బాయి, అరుణ పాల్గొన్నారు.

6న హన్మాన్ శోభాయాత్ర

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో ప్రతీ ఏటా నిర్వహించే విధంగా ఈ ఏడాది కూడా ఏప్రిల్ ఆరో తేదీన హన్మాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివగౌడ్ తెలిపారు. సోమవారం శోభాయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా శివగౌడ్ మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు బాలభారతి ఉన్నత పాఠశాల సమీపంలోని హన్మాన్ మందిరం నుండి ఈ శోభాయాత్ర ప్రారంభం అవుతుందని, పట్టణంలోని పలు వీధుల గుండా సాగి తిరిగి హన్మాన్ మందిరం చేరుకుంటుందని తెలిపారు. అనంతరం బాలభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు హన్మంత్‌రావు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కరీంనగర్ విభాగ్ ప్రముఖ్ రంగస్వామి, హిందూ ఉత్సవ సమితి కోశాధికారి లెక్కల మురళీకృష్ణ, నాయకులు కీర్తి శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె), లంబాడితాండ(కె) గ్రామ పంచాయతీల నర్సరీలను ఎంపీడీఓ ఎంఏ అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలోని మొక్కల వివరాలను, మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎన్ఎండీసీ సీఎండీగా సింగరేణి సీఎండీ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ దేశంలో గల నవరత్న కంపెనీ అయిన జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) సీఎండీగా ఎంపికయ్యారు. దేశంలోని దిగ్గజ సంస్థకు సారథ్యం వహించే అవకాశం సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్‌కు దక్కింది. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి భవన్‌లో ఆయనను కలిసిన సింగరేణి డైరెక్టర్లు బలరామ్, సత్యనారాయణ, ఎన్వీకే శ్రీనివాస్, జీ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.సురేష్‌లు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సింగరేణి సీఎండీగా ఎంపెనీని దేశంలో అగ్రస్థానంలో నిలిపారని, సంస్థ ఉజ్వల భవిష్యత్ కోసం ముందు చూపుతో ఎన్నో నూతన ప్రాజెక్టులను సమర్థవంతంగా ప్రారంభించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో సింగరేణి సారథిగా ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎన్ఎండీసీ సీఎండీగా ఆ కంపెనీని విశ్వవాప్తం చేస్తారని ఆకాంక్షించారు.